

పొత్తు పొడిచేనా?



- అన్నాడీఎంకే-బీజేపీ మధ్య రహస్య మంతనాలు!
- ఈపీఎస్ బృందంపై విమర్శలు వద్దంటూ కమలనాథుల ఆదేశం

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లూ అంటీముంటనట్టుగా వున్న అన్నాడీఎంకే-బీజేపీ మధ్య పొత్తు పొడవనుందా?.. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తున్న ఈ రెండు పార్టీలు.. మున్ముందు కలిసి సాగేందుకు సిద్ధమయ్యాయా?.. దానికోసం రెండు పార్టీల నేతల మధ్య రహస్య మంతనాలు సాగుతున్నాయా?.. అవుననే అంటున్నాయి విశ్వసనీయవర్గాలు. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే.. వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పని చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

నయానో!.. భయానో?..

ఇటీవలి కాలంలో అన్నాడీఎంకే నేతలపై ఈడీ, ఐటీ దాడులు అధికమైనట్లు కనిపిస్తోంది. ఈపీఎస్ సన్నిహితులపై వరుసబెట్టి జరిగిన ఈడీ సోదాలతో ఆ పార్టీ నేతలు బెంబేలెత్తిపోయారు. అన్నీ చట్టప్రకారమే జరుగుతున్నాయని బీజేపీ నేతలు చెబుతున్నా.. అసలు విషయం అది కాదని రాజకీయవర్గాల్లో మాత్రం చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో కమలనాథుల నుంచి అన్నాడీఎంకే నేతలకు సానుకూల సందేశాలు వచ్చాయి. కాగా అన్నాడీఎంకే సీనియర్ నేత డి.జయకుమార్ మాత్రం తాము బీజేపీతో కలిసే ప్రసక్తే లేదంటూ పలుమార్లు ప్రకటించారు.

మైనారిటీల కోసం..!

మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం అన్నాడీఎంకేకు దగ్గరైన బీజేపీ.., ఆ పార్టీతో కలిసి సాగింది. పార్లమెంటులో అన్నాడీఎంకే మద్దతు కూడా పొందింది. అంతేగాక గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి నలుగురు అభ్యర్థులు అసెంబ్లీ మెట్లెక్కారు. అయితే అన్నాడీఎంకే మాత్రం అధికార పీఠం ముందు చతికిలబడింది. బీజేపీతో పొత్తు కారణంగా మైనారిటీ వర్గాలు అన్నాడీఎంకేకు దూరమయ్యాయని, ఇదే ఫలితాల తారుమారుకు కారణమైందని విశ్లేషకులు పేర్కొన్నారు. దీంతో అసలు విషయాన్ని గ్రహించిన ఎడప్పాడి పళనిస్వామి బీజేపీకి దూరమవ్వాలని నిర్ణయించారు. ఆ కారణంగా అన్నాడీఎంకే-బీజేపీ విడిపోయాయి. గత ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లోనూ ఈ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేశాయి. అయితే ఫలితం మాత్రం ఇద్దరికీ నిరాశే మిగిల్చింది. అయితే రెండు పార్టీలు విడిపోవడం వల్లనే నిరాశాజనకమైన ఫలితాలు వచ్చాయని, అన్నాడీఎంకే-బీజేపీ కలిసి పోటీ చేస్తే మరింత మెరుగైన ఫలితాలు వచ్చి వుండేవని మరో వర్గం విశ్లేషించింది.

విజయ్ వైపు మొగ్గు!

బీజేపీ ని దూరంగా పెట్టిన ఈపీఎస్.. నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే వైపు మొగ్గు చూపారు. ఆ పార్టీతో కలిసి వెళ్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమదే విజయమని ఆయన గట్టిగా నిర్ణయించుకున్నారు. ఆ మేరకు విజయ్ పార్టీ ఏర్పాటు, క్యాడర్ తరలింపునకు పరోక్షంగా సహకరించారు కూడా. దీంతో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఖాయమని అన్ని వర్గాలు భావించాయి. కానీ పార్టీ పెట్టిన తరువాత విజయ్ తీరు మారినట్లు అన్నాడీఎంకే వర్గాలు చెబుతున్నాయి. తమతో పొత్తు కావాలంటే రూ.200 కోట్ల నగదు, తామడిగినన్ని సీట్లు, కోరిన స్థానాలు ఇవ్వాల్సి వుందంటూ కొత్తగా వచ్చిన వారు కూడా తమను డిమాండ్ చేస్తున్నారంటూ అన్నాడీఎంకే సీనియర్ నేత ఉదయకుమార్ పరోక్షంగా విజయ్ పార్టీపై రుసరుసలాడారు. దీంతో ఈ రెండు పార్టీల మధ్య పొత్తుపై సందేహాలు నెలకొన్నాయి. తమతో కలిసొచ్చే గట్టి పార్టీల కోసం అన్నాడీఎంకే వేట మొదలెట్టింది. అందులో భాగంగానే వామపక్షాలు, కాంగ్రెస్, డీపీఐ వంటి పార్టీలకు గాలం వేసింది. అయితే డీపీఐ మినహా మిగిలిన పార్టీల నుంచి అంతంతమాత్రంగానే స్పందన వచ్చినట్లు సమాచారం. దీంతో ఈపీఎస్ కొంతకాలం వేచిచూడాలని నిర్ణయించుకున్నారు.

ఈపీఎస్ సన్నిహితులతో మంతనాలు!

ఎవరికి వారుగా విడివడి పోటీ చేస్తే ఇద్దరం నష్టపోతామని, కలిసి సాగితే సత్ఫలితం వస్తుందంటూ డిల్లీ పెద్దలు అన్నాడీఎంకేకు రాయబారం పంపినట్లు తెలిసింది. అంతేగాక ఈపీఎస్‌కు అత్యంత సన్నిహితులైన వారిని డిల్లీకి పిలిపించి మంతనాలు జరిపినట్లు సమాచారం. తమకు కావాల్సింది తమిళనాడులో బలోపేతమవ్వడం, అన్నాడీఎంకేకు కావాల్సింది డీఎంకేను కూల్చి అధికారం చేపట్టడం. అందువల్ల తమతో కలిసొస్తే అన్ని విధాలుగా సహకరిస్తామని, కేంద్రంలోనూ అండగా వుండడంతో పాటు ఎన్నికల సమయంలోనూ సహాయసహకారాలందిస్తామంటూ డిల్లీ పెద్దలు నచ్చి చెప్పారు. దీంతో ఈపీఎస్ సన్నిహితులు ఆ విషయాన్ని తమ అధినేతకు చేరవేసినట్లు విశ్వసనీయ సమాచారం.

రాష్ట్రంలో డీఎంకే బలంగా కనిపిస్తోంది. ఇబ్బడిముబ్బడిగా జరుగుతున్న పథకాల పందేరం, అన్నాడీఎంకేలో గట్టి నేత లేకపోవడం తదితరాలతో డీఎంకేకు ఎదురే లేకుండాపోయింది. అయితే ఇటీవల నిధుల లేమితో కొన్ని పథకాలు కుంటుపడడం,

పొంగల్‌కు నగదు పంపిణీ లేకపోవడం, వరుసగా మహిళలపై జరుగుతున్న దాడులతో డీఎంకే ప్రభుత్వం అప్రతిష్ట మూటగట్టుకుంటోంది. దీంతో తాము పుంజుకోవడానికి ఇదే సరైన సమయమని ఈపీఎస్ గట్టిగా నిర్ణయించుకున్నారు.. డీఎంకేను ఓడించాలన్నా, మళ్లీ అధికారం చేజిక్కించుకోవాలన్నా తమకు గట్టి మద్దతు అవసరమని భావిస్తున్న ఈపీఎస్.. తమకు అన్ని విధాలుగా అండదండలందించే పార్టీ కోసం ఎదురు చూస్తున్నారు. కానీ డీఎండీకే మినహా మరే పార్టీ అన్నాడీఎంకేతో జతకట్టే ఛాయలు కనిపించడం లేదు. దీంతో ఏం చేయాలనే ఆలోచనలో ఈపీఎస్ ఉన్నారు. ఇదే

ఈపీఎస్ నిర్ణయమేంటో?

సమయంలో బీజేపీ నుంచి వస్తున్న 'ఆఫర్' పట్ల ఆయన ఎక్కడా నోరు మెదపలేదు. సరికదా, తన చుట్టూ వుండే నేతలతోనూ ఆయన చర్చించకుండా గుంభనంగా వున్నారు. దీంతో ఈపీఎస్ మనసులో ఏముందోనన్నదానిపై ద్వితీయ శ్రేణి నేతలతో పాటు సీనియర్లు కూడా ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఈపీఎస్ గతంలో చెప్పినట్లుగా బీజేపీకి దూరంగా వుంటారా? లేక డీఎంకేను కూల్చేందుకు బీజేపీతో చేతులు కలుపుతారా అన్నదానిపై ఉత్కంఠ నెలకొంది.

విమర్శలు ఆపండి: కార్యకర్తలకు బీజేపీ పెద్దల ఆదేశం

అన్నాడీఎంకేపై విమర్శలు చేయవద్దని బీజేపీ అధిష్ఠానం రాష్ట్ర నేతలను ఆదేశించింది. నిజానికి గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై దివంగత ముఖ్యమంత్రి జయలలితపై చేసిన విమర్శలే ఆ రెండు పార్టీల మధ్య విభేదాలకు కారణమైంది. ఆ తరువాత కూడా డీఎంకేతో పాటు అన్నాడీఎంకే నేతల అవినీతిపైనా అన్నామలై జాబితాలు విడుదల చేశారు. అయితే ఇకపై అన్నాడీఎంకేపై ఎలాంటి విమర్శలు చేయవద్దని, ఆ పార్టీ పట్ల సానుకూల దృక్పథంతో వుండాలన్ని బీజేపీ రాష్ట్ర నేతలకు డిల్లీ పెద్దలు ఆదేశించినట్లు తెలిసింది.



గాంధీజీని అవహేళన చేస్తూనే ఉంటారా?

- సీఎం స్టాలిన్‌పై భగ్గుమన్న గవర్నర్

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జాతిపిత గాంధీజీ జీవిత పర్యంతమూ ద్రావిడ సిద్ధాంతాలను ఆచరించినవారి నుంచి తీవ్రమైన విమర్శలను, అవహేళన ఎదుర్కొన్నారని, ఇంకా ఆ అవహేళనలను కొనసాగిస్తూనే ఉంటారా? అంటూ గవర్నర్ ఆర్ఎన్ రవి ముఖ్యమంత్రి స్టాలిన్‌పై విరుచుకుపడ్డారు. ఈ మేరకు గురువారం తన ఎక్స్‌పేజీలో ఆయన ఓ సందేశం వెలువరించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 1956లో గిండి జాతీయ ఉద్యానవనంలో గాంధీ మండపాన్ని నిర్మించారని, అక్కడ గాంధీ జయంతి, వర్ధంతి కార్యక్రమాలు జరుపటానికి బదులుగా ఎక్కడో ప్రభుత్వ మ్యూజియం మూలన ఈ కార్యక్రమాలను జరుపటం సమర్థనీయమేనా? అని గవర్నర్ ప్రశ్నించారు. జాతిపితకు తగిన గౌరవం కల్పించేలా ఆ కార్యక్రమాలను గాంధీ మండపం వద్దే నిర్వహించాలని ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తాను ఎన్నోమార్లు కోరినా పట్టించుకోలేదని ససేమిరా కుదరదంటూ మంకుపట్టు పట్టారని గవర్నర్ విమర్శించారు.

ఆ సెర్చ్ కమిటీని ఉపసంహరించుకోండి. ...

ఇదిలా ఉండగా మదురైలోని కామరాజర్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఎంపిక కోసం ప్రభుత్వం నియమించిన సెర్చ్ కమిటీని ఉపసంహరించాలని గవర్నర్ ఆదేశించారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఈ నెల 9న మదురై కామరాజర్ విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌ను నియమించే దిశగా ఓ సెర్చ్ కమిటీని ఏర్పాటు చేసి ఆ ప్రతిపాదనను గవర్నర్‌కు పంపింది. ప్రతిపాదన సుప్రీం కోర్టు తీర్పు ఉల్లంఘించేలా ఉందని, యూజీసీ ప్రతినిధి లేకుండా ఏర్పాటు చేసిన కమిటీ ఉత్తర్వును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా యూజీసీ కొత్త నిబంధనల ప్రకారం యూజీసీ ప్రతినిధితో పాటు విశ్వవిద్యాలయాల ఛాన్సలర్‌గా తాను ఏర్పాటు చేసే సెర్చ్ కమిటీకి సానుకూలంగా తాజా ఉత్తర్వు జారీ చేయాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించారు.



చెన్నై ఎగ్మూరు మ్యూజియం వద్ద గురువారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, రాష్ట్రమంత్రులు, ఎంపీలు



విద్యార్థులకు ఈవెనింగ్ స్నాక్స్

- 81 త్రీడీ బస్‌స్టాపులు
- చెన్నై కార్పొరేషన్ సమావేశం

అడయార్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై నగర పాలక సంస్థ (కార్పొరేషన్) సమావేశం గురువారం నగర మేయర్ ఆర్.ప్రియ అధ్యక్షతన జరుగగా, ఇందులో 10, 11, 12 తరగతుల విద్యార్థులకు ఈవెనింగ్ స్నాక్స్ అందజేయాలని తీర్మానం చేశారు. అలాగే, కార్పొరేషన్ పరిధిలోని 15 జోన్లలో 81 చోట్ల కొత్తగా త్రీడీ మోడల్ బస్టాపులను నిర్మించడంతో పాటు మొత్తం 96 తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా డీఎంకే సభ్యుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ, స్టాండింగ్ కమిటీ సమావేశాలకు కార్పొరేషన్ ఉన్నతాధికారులు హాజరుకావడం లేదన్నారు. దీనికి మేయర్ ఆర్.ప్రియ సమాధానమిస్తూ, నగర పాలక సంస్థలో నలుగురు డిప్యూటీ కమిషనర్లతో పాటు అనేక ఐపీఎస్ అధికారులున్నారని, చెన్నై కార్పొరేషన్‌లో పనిభారం అధికంగా ఉండటం వల్ల ప్రభుత్వం కూడా అధిక సంఖ్యలో అధికారులను నియమించిందని తెలిపారు. ఇకపై ఇలాంటి సమస్య పునరావృతంకాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటారన్నారు. ఆ తర్వాత పలువురు సభ్యులు ప్రసంగించగా, దాదాపు 96కుపైగా తీర్మానాలను చేసి ఆమోదించారు. వీటిలో కొన్నింటిని మేయర్ ప్రియ వివరిస్తూ, హైయ్యర్ సెకండరీ పాఠశాలల్లో 10, 11, 12 తరగతుల విద్యార్థులకు ఈవెనింగ్ స్నాక్స్‌ను కార్పొరేషన్ పరిధిలోని 81 హైయ్యర్ సెకండరీ పాఠశాలలకు సరఫరా చేయాలని కోరారు. నగర పాలక సంస్థ పరిధిలో పెంపుడు జంతువులను పెంచేవారు విధిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆ జంతువులకు మైక్రోచిప్ అమర్చాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్, కమిషనర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఎలైట్ స్కీమ్


- ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



సచివాలయంలో ఉప ముఖ్యమంత్రిని కలిసిన టెన్నిస్ క్రీడాకారుడు పృథ్వీశేఖర్

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రతిభా పాటవాలున్నప్పటికీ ఆర్థిక సహకారంలేక జాతీయ అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనలేని క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఎలైట్ స్కీమ్ అమలు చేస్తోందని ఆ శాఖ నిర్వర్తిస్తున్న ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. విదేశాల్లో జరిగే క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతున్న క్రీడాకారులకు ఆర్థిక సహాయం చేసేందుకే ఈ ఎలైట్ స్కీమ్ అమలు చేస్తున్నామన్నారు. ఇటీవల బధిర క్రీడాకారుల కోసం ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్ నగరంలో టెన్నిస్ సింగిల్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో ట్రోఫీ గెలుచుకుని తిరిగొచ్చిన క్రీడాకారుడు పృథ్వీశేఖర్ గురువారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రిని కలుసుకోగా అతడిని అభినందించారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ ఎలైట్ స్కీమ్ కింద క్రీడాకారులకు ఇచ్చే వార్షిక ప్రోత్సాహక నగదును రూ.25లక్షల నుండి రూ.30లక్షలకు పెంచినట్లు తెలిపారు. ఈ స్కీమ్ ద్వారా లబ్ధి పొందే క్రీడాకారుల సంఖ్య 12 నుండి 27కు పెరిగిందన్నారు. ఉదయనిధితోపాటు యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్యమిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథ రెడ్డి కూడా పృథ్వీశేఖర్‌ను ప్రశంసించారు. పృథ్వీశేఖర్ తల్లిదండ్రులు ఉప ముఖ్యమంత్రి కి ధన్యవాదాలు తెలిపారు.

నేడు నగరానికి ఉప రాష్ట్రపతి



ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌గడ్

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ అధ్యక్షుడు జగదీప్ ధన్‌గడ్ ఒక్కరోజు పర్యటన నిమిత్తం శుక్రవారం నగరానికి రానున్నారు. ముట్టుకాడు, పర్యాటక ప్రాంతం మహాబలిపురం వద్ద జరిగే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారు. ఉప రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో చెన్నై విమానాశ్రయం, రాజ్‌భవన్, ముట్టుకాడు, మహాబలిపురం ప్రాంతాల్లో పోలీసు అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు.

తమిళనాట పెరుగుతున్న జాతీయవాదం

- తమిళ సంస్కృతి అంటే మోదీకి ఎంతో ఇష్టం
- సత్కారసభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న రైతు సంఘాల నాయకులు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ రాజకీయాల కోసం కాకుండా వాస్తవంగానే తమిళ ప్రజలను, తమిళ సంస్కృతి సంప్రదాయాలను ప్రేమిస్తున్నారని, జాతీయవాదం పెరుగుతున్నందున తమిళ ప్రజలు మోదీని ఆదరిస్తారనే నమ్మకం తనకుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మదురై జిల్లా ఎ.వళ్ళాల్‌పట్టి గ్రామంలో గురువారం సాయంత్రం టంగ్‌స్టన్ పథకాన్ని రద్దుచేసినందుకు ధన్యవాదాలు తెలిపేందుకు అరిటాపట్టి పరిసర గ్రామాలకు చెందిన గ్రామపెద్దలు, రైతులు, వివిధ ఉద్యమ సంస్థల ప్రతినిధులు కిషన్ రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ సభలో ఆయన మాట్లాడుతూ మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందని, తమిళ సంస్కృతితోపాటు దేశ సంస్కృతి, వారసత్వ సంపదను పరిరక్షిస్తోందన్నారు. ప్రధాని మోదీని అమితంగా ఆదరిస్తున్న తమిళ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పలు సభలలో తమిళుల సంస్కృతి, సంప్రదాయాలను, గొప్పతనం గురించి మోదీ ఎలుగెత్తిచాటారని అన్నారు. పార్లమెంట్‌లో తమిళులంతా గర్వపడేలా సెంగోల్‌ని ప్రతిష్ఠించారని, మోదీ తీసుకున్న ఆ చారిత్రాత్మక నిర్ణయం తమిళుల ప్రాచీన చరిత్రను యావత్ ప్రపంచానికి తెలిసేలా చేసిందన్నారు. ఇవన్నీ రాజకీయ స్వార్థంతో కాకుండా తమిళ ప్రజలపై తనకున్న ప్రేమ కారణంగా చేస్తున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. టంగ్‌స్టన్ తవ్వకాలవల్ల కలిగే నష్టాలను ఢిల్లీకి వచ్చి అరిటాపట్టి, తదితర గ్రామాలకు చెందిన పెద్దలంతా తనకు వివరించారని, వెంటనే ఈ విషయాన్ని పరిశీలించి కేంద్ర ప్రభుత్వం ఆ పథకం రద్దుచేసిందన్నారు. స్థానికుల ఒత్తిడి మేరకే తాను ఈ సత్కారసభకు వచ్చానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తదితరులు పాల్గొన్నారు.

సమాచార దర్శిని

గ్రూప్-2, 2ఏ మెయిన్స్ హాల్ టికెట్ల విడుదల

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2,2ఏ పరీక్షల హాల్ టిక్కెట్లను టీఎన్‌పీఎస్సీ విడుదల చేసింది. ప్రభుత్వ శాఖల్లోని గ్రూప్-2 పోస్టుల భర్తీకి గత ఏడాది సెప్టెంబరు 14వ తేది ప్రిమిలినరీ పరీక్షలు జరి గాయి. అందులో ఉత్తీర్ణులైన వారికి ఫిబ్రవరి 8 నుంచి 23వ తేది వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించనున్నారు. అభ్యర్థులు దరఖాస్తు నెంబరు, పుట్టిన తేది www. tnpsc.gov.in, www.tnpscexams.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసి హాల్ టిక్కెట్లు పొందవచ్చని టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

డిగ్రీ కోర్సులకు సమానంగా 36 కోర్సులు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పలు డిగ్రీ కోర్సులకు సమానంగా 36 కోర్సుల వివరాలను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి గోపాల్, విశ్వవిద్యాలయాల ఉప కులపతులకు పంపించారు. నగరంలో ఇటీవల 30 'సమాన కమిటీ' సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు బీ.ఎస్సీ బోటనీ, ఎలక్ట్రానిక్, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ టెక్నాలజీ, ఐటీ సమానమైన 36 కోర్సుల వివరాలను ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి అన్ని విశ్వవిద్యాలయాలకు పంపించారు.

4న ఉపాధ్యాయులతో చర్చలు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రాథమిక విద్యాశాఖ ఆధ్వర్యంలోని పాఠశాలల్లో 2009 జూన్ తర్వాత సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, అంతకు ముందు చేరిన వారికి సమానంగా 'సమాన వేతనం' ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశం పరిశీలకు రాష్ట్ర ప్రభుత్వం ఓ కమిటీ ఏర్పాటుచేయగా, కమిటీ ఇప్పటికే మూడు సార్లు ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపింది. నాలుగో విడత చర్చలు ఫిబ్రవరి 4వ తేది సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో జరుగనుందని, ఈ చర్చలకు ఐదు ఉపాధ్యాయ సంఘాలను ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు.

రైళ్లలో రాత్రి వేళ 'నో సెల్ ఛార్జింగ్'

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో రాత్రి వేళ సెల్‌ఫోన్ ఛార్జింగ్ సదుపాయం ఉండదని రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే బోర్డు ఉత్తర్వుల మేరకు రైళ్లలో అగ్నిప్రమాదాలను నివారించడంలో భాగంగా రైలు బోగీల్లో సెల్‌ఫోన్ ఛార్జింగ్ చేసే ప్లగ్ పాయింట్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుంటారు. ఇటీవలి కాలంలో రైలు బోగీల్లో ఛార్జింగ్ పాయింట్లు పనిచేయడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై అధికారులు స్పందిస్తూ... 2014లో రైల్వే భద్రతా కమిషనర్ జారీచేసిన ఉత్తర్వుల మేరకు, రైలు బోగీల్లోని ఛార్జింగ్ పాయింట్లకు రాత్రి 11 నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు, ముందస్తు చర్యలో భాగం గా విధానం అమలుచేస్తున్నట్లు తెలిపారు.

కో-ఆప్‌టెక్స్ ఉద్యోగులకు 15 శాతం వేతనం పెంపు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కో-ఆప్‌టెక్స్ ఉద్యోగులకు 15 శాతం వేతనాలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర సహకార శాఖలో ఉన్న కో-ఆప్‌టెక్స్ సంస్థ, 89 ఏళ్లుగా రాష్ట్రంలోని చేనేత కార్మికుల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేసి రాష్ట్రం, పలు రాష్ట్రాల్లో ఉన్న 150 విక్రయ కేంద్రాల ద్వారా విక్రయిస్తోంది. ఈ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు వేతనం పెంపు సహా పలు కోర్కెలను రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. తాజాగా, కో-ఆప్‌టెక్స్ ఉద్యోగులకు 15 శాతం వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, ఆఫీస్ అసిస్టెంట్ నుంచి చీఫ్ జనరల్ మేనేజరు వరకు 10 స్థానాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు 15 శాతం వేతనం, ఇంటి అద్దె, సిటీ సెస్ పెంచుతున్నట్లు, ఈ పెంపు 2023 జూలై నుంచి అమలుకు వస్తుందని ప్రభుత్వం తెలిపింది.

9 నుంచి చతుర్వేద పారాయణం

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువేంగాడు సుబ్రమణ్య ఘనపాడిగళ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 87వ వార్షిక కృష్ణ యజుర్వేద పారాయణం, చతుర్వేద పారాయణం, మహారుద్ర యాగం ఫిబ్రవరి 9 నుంచి 11వ తేది వరకు నిర్వహించనున్నారు. అలాగే, 15వ తేది సాయంత్రం తిరునాంగూర్ మురళీధరస్వామి నేతృత్వంలో వేదపఠనం, 17వ తేది మధ్యాహ్నం వడగుడి శంకరరామ దీక్షితార్, సెగలపది సుబ్రమణ్య ఘనపాటి నేతృత్వంలో వేద పరీక్ష జరుగనుంది. చివరి రోజు 19వ తేది వందలాది మంది వేదపండితులు, శివాచార్యుల, ఫౌండేషన్ ట్రస్టీలు, న్యాయవాది కుప్పుస్వామి, సభ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ చంద్రన్ సత్కరించనున్నారు. 2026 అయోధ్యలో 88వ వార్షిక పారాయణం నిర్వహించనున్నట్లు చంద్రన్ ప్రకటించారు.

132 సహాయ లెక్చరర్ల పోస్టుల భర్తీకి రాతపరీక్ష

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లా కళాశాలల్లో అసిస్టెంట్ లెక్చరర్లు సహా 132 పోస్టుల భర్తీకి రాతపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ ప్రకటనలో తెలిపింది. తగిన విద్యార్హతలున్న వారు శుక్రవారం నుంచి మార్చి 3వ తేది వరకు పరీక్ష శాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మే 11వ తేది రాతపరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్హత, వయస్సు ఇతర వివరాలను ప్రభుత్వ పరీక్ష శాఖ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

'రేలా' లో వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స



కృత్రిమ బెలూన్ పరికరాన్ని పరిశీలిస్తున్న వైద్యనిపుణులు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్రోంపేటలోని రేలా ఆస్పత్రిలో విద్యుదాఘాతానికి గురై కుడి భుజర ఎముక కదలకుండా అస్వస్థతకు గురైన రాజప్రకాశం అనే వృద్ధుడికి బెలూన్ ఇంప్లాంటేషన్ తరహా శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి సీఈఓ డాక్టర్ ఇలంకుమరన్ కలియమూర్తి తెలిపారు. శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాధారణంగా భుజం ఎముక కీలు కదలకపోతే కీలు మార్చిడి చికిత్స చేయాల్సి ఉంటుందని అయితే వృద్ధాప్యం ఉన్న వ్యక్తికి ఆ చికిత్సకు ప్రత్యామ్నాయంగా ఈ బెలూన్ ఇంప్లాంటేషన్ చికిత్స జరిపినట్లు చెప్పారు. ఈ చికిత్స ద్వారా రోగి త్వరగానే తన కుడి చేతిని పైకెత్తగలుగుతాడని డాక్టర్ ప్రకాష్ అయ్యాదురై తెలిపారు.

అంగన్వాడీ భవనం ప్రారంభం



భవనం ప్రారంభిస్తున్న మంత్రి దురుమురుగన్

వేలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ గురువారం కాట్పాడి పంచాయతి యూనియన్‌లో పర్యటించి, పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అమ్ముండి పంచాయతీలో రూ.13.57 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ భవనం, కాట్పాడి పంచాయతీలో ఎమ్మెల్యే నియోజకవర్గ నిధులు రూ.11 లక్షలతో నిర్మించిన బస్‌స్టాప్‌ఎను మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, కార్పొరేషన్ ఉప మేయర్ సునీల్‌కుమార్, 1వ మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత, కాట్పాడి యూనియన్ కమిటీ ఉపాధ్యక్షుడు శరవణన్, గ్రామీణాభివృద్ధి పథక డైరెక్టర్ సెంథిల్‌కుమారన్, జిల్లా పిల్లల అభివృద్ధి పథక అధికారి సెల్విశాంతి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

జబగర్ అలి మృతదేహం పరిశీలించాలి

● హైకోర్టు ఉత్తర్వులు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సంఘ సేవకుడు జబగర్ అలి మృతదేహాన్ని వెలికితీసి పరిశోధించాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. పుదుకోట జిల్లా తిరుమయం సమీపంలో అక్రమంగా పనిచేస్తున్న క్వారీలకు వ్యతిరేకంగా పోరాడిన సంఘ సేవకుడు జబగర్ అలి (58) ఈ నెల 5వ తేది లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. క్వారీ మాఫియా అతడిని హత్యచేసిందనే ఆరోపణల నేపథ్యంలో, క్వారీ యజమాని సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో, జబగర్ అలి హత్యకేసు విచారణ రాష్ట్ర ప్రభుత్వం సీబీసీఐడీకి అప్పగించింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని వివరాలు, స్థానిక పోలీసులు సీబీసీఐడీకి అప్పగించారు. ఈ వ్యవహారంపై తిరుమయం సీఐ గుణశేఖరన్‌ను సస్పెండ్ చేస్తూ తిరుచ్చి డీఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నేపథ్యంలో, ఈ కేసు గురువారం విచారణకు రాగా, మృతదేహం బయటకు తీసి పరిశీలించాలని హైకోర్టు మదురై బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. మృతదేహం పరిశీలన సమయంలో ఫొటోలు తీసుకొనేందుకు అనుమతించరాదని, మీడియా సహా ఎవ్వరిని అనుమతించరాదని హైకోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించింది.

విల్లుపురంలో రూ.1.60 కోట్ల హవాలా నగదు స్వాధీనం





పట్టుబడిన నగదు సహా నిందితులు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విల్లుపురంలో రూ.1.60 కోట్ల హవాలా నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. విల్లుపురం కొత్త బస్టాండ్ సమీపంలో కొందరు నగదు తో ఉన్నారని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడకు వెళ్లి అనుమానాస్పదంగా ఉన్న నలుగురు బ్యాగులు తనిఖీ చేసి రూ.1.60 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో తురైయూర్‌కు చెందిన మహమ్మద్ రియాజ్, సిరాజుద్దీన్, అబూబకర్, సిద్దిక్ రాజ్‌మహమ్మద్ అని, చెన్నై నుంచి నగదు తీసుకొస్తున్నట్లు తెలిసింది. నగదు స్వాధీనం చేసుకొని ఐటీ అధికారులకు అప్పగించిన పోలీసులు, ఈ నగదు ఎవరిది? ఎక్కడకు తీసుకెళ్తున్నారు? అనే విషయాలపై నలుగురిని ప్రశ్నిస్తున్నారు.

మాజీ సైనికులకు వ్యాపారావకాశాలు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారిపై ఆధారపడిన వారిని పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ముదల్వరిన్ కాకుమ్ కరంగల్' అనే పథకం అమలుచేస్తోంది. ఈ పథకం ద్వారా వ్యాపారాలు ప్రారంభించే వారికి రూ. కోటి వరకు బ్యాంక్ రుణాలు అందజేయనున్నారు. ఇందులో 30 శాతం రాయితీ, 3 శాతం వడ్డీ రాయితీ ఇవ్వనున్నారు. స్వయం ఉపాధి ప్రారంభించాలనుకునే మాజీ సైనికులు, రెజిమెంట్‌లో మరణించిన సైనికుల కుటుంబసభ్యులు సైదాపేటలోని మాజీ సైనిక సంక్షేమ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయాన్ని సంప్రదించవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

వేళచ్చేరి తపాలా కార్యాలయం చిరునామా మార్పు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి మెయిన్ రోడ్డులోని తాండేశ్వరం బస్టాండ్ సమీపంలో తపాలా కార్యాలయం ఉంది. స్థలాభావం కారణంగా ఈ తపాలా కార్యాలయం వేళచ్చేరి-తరమణి లింక్ రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ భవనంలోకి మార్చినట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దిగువ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అన్నానగర్: అన్నానగర్ ఏ నుంచి డబ్ల్యూ బ్లాక్‌లు, వీఓసీ నగర్, షేనాయ్ నగర్, అమిందికరై, ఆర్వీ నగర్, టీపీ సత్రం, కీల్పాక్కు గార్డెన్ రోడ్డు కొంత భాగం, పెరియకూడల్ ఎపి బ్లాక్ నుంచి ఎఎం బ్లాక్ వరకు, తిరువీధి అమ్మన్ ఆలయ వీధి

మడిపాక్కం: రామ్ నగర్ సౌత్, నార్త్, కుబేరన్ నగర్, ఎల్ఐసీ నగర్, షీలా నగర్, రామలింగం నగర్, శివప్రకాశం నగర్, బృందావన్ నగర్, సదాశివం నగర్, పెరియార్ నగర్, మహాలక్ష్మి నగర్, మడిపాక్కం, పుళిదివాక్కం కొంత భాగం, కార్తికేయపురం, ఉల్లగరం కొంత భాగం, అయ్యప్ప నగర్, కీళకట్టలై కొంత భాగం, మూవరసన్‌పేట కొంత భాగం, లక్ష్మి నగర్, అన్నై థెరిస్సా నగర్, మేడవాక్కం మెయిన్ రోడ్డు కొంత భాగం, శబరి రోడ్డు కొంత భాగం, బజార్ రోడ్డు కొంత భాగం.

ప్రాథమిక టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

● పీఎంకే నేత డా.రాందాస్



డిటో జాక్ సంఘ నిర్వాహకులతో రాందాస్

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రాథమిక టీచర్ల సమస్యలు పరిష్కరించాలని పీఎంకే వ్యవస్థాపకులు డా. రాందాస్ డిమాండ్ చేశారు. విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలో ఉన్న తైలాపురం గార్డెన్‌లో గురువారం ఉదయం డిటో జాక్ సంఘానికి చెందిన నిర్వాహకులు రాందాస్‌ను కలిసి తమ సమస్యల గురించి చర్చించారు. సమావేశం అనంతరం రాందాస్ మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల టీచర్ల దీర్ఘకాల కోరికలైన పాత పింఛన్ విధానం, విద్యార్హతను బట్టి వేతనం, జీవో 234 రద్దు, ఉన్నత విద్య నేర్చుకొనేందుకు ప్రోత్సాహిక నిధి మళ్లీ అందజేయడం తదితర 15 అంశాల కోరికలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చాలని ఆయన కోరారు.

కేంద్రమంత్రి అమిత్ షాకు నల్లజెండాలతో నిరసన

● సెల్వ పెరుందగై

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా పర్యటనను వ్యతిరేకిస్తు నల్లజెండాలతో నిరసన తెలపనున్నట్లు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై పేర్కొన్నారు. మహాత్మాగాంధీ 78వ వర్ధంతిని పురస్కరించుకొని ఎగ్మూర్‌లోని ప్రభుత్వ మ్యూజియం ప్రాంగణంలో ఉన్న గాంధీ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలసి గురువారం సెల్వపెరుందగై అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... రాజ్యాంగ నిర్మాణ శిల్పి డా.అంబేడ్కర్‌ను కించపరిచేలా వ్యాఖ్యానించిన కేంద్రమంత్రి అమిత్ షాకు వ్యతిరేకంగా నల్లజెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు తగిన భద్రత కల్పించాలని, రాత్రి సమయంలో మహిళలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావాలని సెల్వపెరుందగై డిమాండ్ చేశారు.

ఆర్‌ఎస్‌ఆర్‌ఎంలో వసతుల పెంపునకు రూ.11.63 కోట్లు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురంలోని ప్రభుత్వ ఆర్ఎస్ఆర్ఎం ఆస్పత్రిలో వసతుల పెంపునకు రూ.11.63 కోట్లు, బ్లడ్ బ్యాంక్ అభివృద్ధికి రూ.1.74 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం జీవో విడుదల చేసింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... 1880లో 74 పడకల వసతితో ప్రభుత్వ రాజా సార్ రామస్వామి ముదలియార్ (ఆర్ఎస్ఆర్ఎం) ఆస్పత్రి నిరుపేద గర్భిణులకు వైద్య సేవలందించేలా ప్రారంభించారు. ఉత్తర చెన్నై ప్రాంతాలు, గుమ్మిడిపూండి, పొన్నేరి, మీంజూరు సహా చెన్నైకి సమీపంలోని జిల్లాల నుంచి కూడా గర్భిణులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. ఈ ఆసుపత్రిలో ఏడాదికి సుమారు 12వేల ప్రసవాలు జరుగుతుంటాయి. ప్రస్తుతం 610 పడకల నుంచి 810 పడకలకు విస్తరించేలా, అధునిక పరికరాలు, ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.11.63 కోట్లు కేటాయించింది. అలాగే, ఆస్పత్రిలో ఉన్న బ్లడ్ బ్యాంక్ అభివృద్ధికి రూ.1.74 కోట్లు కేటాయించింది. ప్రసవ సమయంలో మహిళలకు సత్వరం రక్తం అందించేందుకు ఈ బ్లడ్ బ్యాంక్ ఉపయోగపడుతుందని ప్రభుత్వం తెలిపింది.

25 నుంచి టెన్త్ ప్రాక్టికల్స్

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో సైన్స్ ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి 28వ తేది వరకు జరుగుతాయని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది. ప్రైవేటు అభ్యర్థులకు సైన్స్ కోర్సు శిక్షణా తరగతులు నిర్వహించిన పాఠశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

వేదనాథస్వామి ఆలయంలో 2న మహాకుంభాభిషేకం



ఆలయ ప్రాంగణంలో యాగశాల పూజలు నిర్వహిస్తున్న భట్టాచార్యులు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అష్టోత్తర శత వైష్ణవ దివ్యక్షేత్రాల్లో మొదటిదైన కడలూరు సమీపం తిరువందిపురం వేదనాథస్వామి ఆలయ కుంభాభిషేక ఏర్పాట్లలో భాగంగా గురువారం యాగశాల పూజలు ప్రారంభమయ్యాయి. ఇటీవలే జీర్ణోద్ధరణ పనులు పూర్తయిన నేపథ్యంలో ఈ ఆలయ కుంభాభిషేక వేడుకలు ఫిబ్రవరి 2 ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్నారు. ఈ వేడుకల కోసం ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం పుణ్యావహచనం, వాస్తు శాంతి, మహా శాంతి హోమం జరిగాయి. సాయంత్రం శ్రీరంగం శ్రీమద్ ఆండవన్ స్వామి పర్యవేక్షణలో తిరుపతి, బెంగళూరు, హైదరాబాద్ తదితర నగరాల నుండి వచ్చిన 75 మంది భట్టాచార్యుల వేదమంత్రోచ్చారణ నడుమ యాగశాల పూజ ప్రారంభమైంది. గురువారం ఉదయం నుండి అగ్ని పారాయణం, నిత్య హోమాలు జరిగాయి. సాయంత్రం కుంభ ఆరాధన జరిపారు. ఫిబ్రవరి 1న మహాశాంతి తిరుమంజనం, కలశాల ఊరేగింపు, సాయంత్రం శయనాధివాసం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 2న మహాకుంభాభిషేకం జరుగనుంది. ఆ రోజు ఉదయం స్వామివారి విశ్వరూప దర్శనం, ప్రధాన హోమం, మహాపూర్ణాహుతి జరుగుతాయి. రాత్రి స్వర్ణశేషవాహనంపై ఉభయనాంచారులతో స్వామివారు విహరించనున్నారు. ఈ మహాకుంభాభిషేక వేడుకలకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు కూడా చేపడుతున్నారు.

తాంబరం కార్పొరేషన్‌గా మారినా కష్టాలు తీరలేదు

● మాజీ మంత్రి డి.జయకుమార్



ధర్నాలో జయకుమార్, చిన్నయ్య తదితరులు

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీగా ఉన్న తాంబరం కార్పొరేషన్ స్థాయికి పెరిగినా కనీసవసతులు కల్పించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి డి.జయకుమార్ ఆరోపించారు. తాంబరం పరిధిలోని పెరుంగళత్తూర్‌లో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జయకుమార్ మాట్లాడుతూ... తాంబరం, పరిసర ప్రాంతాల్లో ఒకేరోజు 18 సవర్ల గొలుసులు దోచుకున్న నిందితులను అరెస్ట్ చేయలేదని, మాదకద్రవ్యాల వినియోగం బహిరంగంగా సాగుతోందని, అయినా పోలీసులు కట్టడి చేయలేకపోతున్నారని ఆరోపించారు. . తాంబరం జీఎస్టీ రోడ్డులో వాహన రాకపోకలు పెరుగుతున్నా, రోడ్లకు మరమ్మతులు చేపట్టలేదన్నారు. ఈ ధర్నాలో మాజీ మంత్రి చిన్నయ్య, మాజీ ఎమ్మెల్యే ధనసింగ్ పాల్గొన్నారు.

'కలైంజర్ కనవు ఇల్లం' పథకానికి అదనంగా రూ.500 కోట్లు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): 'కలైంజర్ కనవు ఇల్లం' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.500 కోట్లు కేటాయించింది. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో... ఈ పథకంలో లక్ష కాంక్రీట్ ఇళ్లు నిర్మించాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఒక ఇంటికి రూ.3.5 లక్షల చొప్పన మొత్తం రూ.3,500 కోట్లు కేటాయించేందుకు అనుమతిచ్చింది. ఇప్పటివరకు ఈ పథక అమలుకు రూ.1,625.30 కోట్లు కేటాయించిన ప్రభుత్వం, లబ్ధిదారులు వారి ఇళ్ల నిర్మాణ స్థితిగతులను బట్టి రూ.1,350.99 కోట్లు విడుదల చేసింది. అలాగే, సిమెంట్, ఐరన్ తదితరాలకు రూ.249.86 కోట్లు అందించింది. ప్రస్తుతం ఈ పథకానికి మరో రూ.500 కోట్లు కేటాయించగా, ఇప్పటి వరకు రూ.2,125.30 కోట్లు కేటాయించినట్లు, ఇళ్ల నిర్మాణ స్థితిగతులకు అనుగుణంగా వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమచేయనున్నట్లు సచివాలయం తెలిపింది.

ట్రిప్లికేన్‌లో బాక్సర్ దారుణహత్య

● కొన్ని గంటల వ్యవధిలోనే నిందితుల్ని అరెస్టు చేసిన పోలీసులు



బాక్సర్ ధనుష్ (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్ నియోజకవర్గంలో ఓ బాక్సర్‌ను వెంటాడి బుధవారం అర్ధరాత్రి దారుణంగా హతమార్చిన కిరాయి ముఠాకు చెందిన తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు ట్రిప్లికేన్ కృష్ణమ్మాళ్‌పేటకు చెందిన రాజేష్, రాధా దంపతుల కుమారుడు ధనుష్ (24) రాష్ట్ర, జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాడు, అతను ప్రస్తుతం పోలీసు ఉద్యోగం కోసం రాతపరీక్షకు సిద్ధమవుతున్నాడు. కొన్ని నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన కొంతమంది యువకులకు ధనుష్ మధ్య సమస్య ఏర్పడినట్లు తెలిసింది. ఈ గొడవలకు సంబంధించి ధనుష్‌పై పోలీసులు కేసు కూడా పెట్టారు. దీంతో ఆయన పోలీసు శాఖ రాతపరీక్షలకు హాజరుకాలేకపోయాడు.. ఇదిలా ఉండగా బుధవారం అర్ధరాత్రి ఇంటిబయట నిలబడివున్న ధనుష్‌ను గుర్తుతెలియని ముఠా మారణాయుధాలతో దాడికి యత్నించారు. వారి బారినుండి తప్పించుకునేందుకు అక్కడి నుండి పరుగుతీసిన ధనుష్‌ను ఆ ముఠా వెంటాడి హత్యచేసింది. అడ్డుకునేందుకు యత్నించిన ధనుష్ స్నేహితుడు అరుణ్ కూడా కిరాయి ముఠా దాడిలో తీవ్రగాయాలయ్యాయి. ఇరుగుపొరుగువారు అరుణ్‌ను అంబులెన్సు వాహనంలో రాయపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ధనుష్ కుటుంబసభ్యుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న ఐస్‌హౌస్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదుచేసి ఈ దారుణానికి పాల్పడి పరారైన ముఠా కోసం తెల్లవార్లు పలుప్రాంతాల్లో గాలించిన పోలీసులు, ఎట్టకేలకు గురువారం ఉదయం తొమ్మిది మంది రౌడీ షీటర్లను అరెస్టు చేశారు. సైదాపేట కోర్టులో హాజరుపరచిన అనంతరం వారిని పుళల్ సెంట్రల్ జైలుకు తరలించారు.

పీజీ వైద్య సీట్ల భర్తీలో స్థానికతకు మంగళం

● 1,207 సీట్లు కోల్పోయే ప్రమాదం ● మంత్రి సుబ్రమణ్యం

అడయార్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పీజీ వైద్య సీట్లలో 50 శాతం లోకల్ రిజర్వేషన్ వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో తమిళనాడు రాష్ట్రంతో పాటు దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు తీవ్ర నష్టం కలుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి ఎం.సుబ్రమణ్యం ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయంపై ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఈ తీర్పు వల్ల స్థానిక విద్యార్థులు వైద్య విద్య చదివే అవకాశం కోల్పోయే ప్రమాదముందన్నారు. సుప్రీంకోర్టు తాజా తీర్పుతో రాష్ట్ర వైద్య విద్యార్థులకు చెందిన 1,207 సీట్లను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ సీట్లు కేవలం మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులకు మాత్రమే కాకుండా, అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు కూడా కేటాయించడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఆల్ ఇండియా కోటా కింద కొన్ని సీట్లు కేటాయించగా, ఆ సీట్లలో ఇతర రాష్ట్రాల విద్యార్థులు చదువుతున్నారన్నారు. సుప్రీం తాజా తీర్పుతో మరో 50 శాతం సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

అన్నాడీఎంకేలో చేరికలు



పళనిస్వామితో కొత్తగా పార్టీలో చేరిన కార్యకర్తలు

తిరుత్తణి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పల్లిపట్టుకు చెందిన మాజీ యూనియన్ కౌన్సిలర్, రిటైర్డ్ ఎస్ఐ ఎఎం కన్నయ్య ఆధ్వర్యంలో యువకులు, మహిళలు 100 మంది అన్నాడీఎంకేలో చేరారు. గురువారం జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి మాజీ ఎంపీ తిరుత్తణి కె.హరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో తిరుత్తణి యూనియన్ యూత్ కార్యదర్శి వేలంజేరి పళని, జిల్లా విద్యార్థి సంఘం సంయుక్త కార్యదర్శి జయశేఖర్‌బాబు, ఆర్కేపేట యూనియన్ కార్యదర్శి కె.కుమార్ సహా అన్నాడీఎంకే నిర్వాహకులు పాల్గొన్నారు.

వార్డు కమిటీల ఏర్పాటుకు కృషిచేయాలి

● కాంగ్రెస్ శ్రేణులకు నేతల పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న నేతలు

తిరుత్తణి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల నాటికి పట్టణ, మున్సిపాలిటీ, గ్రామాల్లో వార్డు కమిటీలు ఏర్పాటు చేసి పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు నేతలు పిలుపునిచ్చారు. అరక్కోణం లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని తిరుత్తణి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం కేజీ కండ్రిగలో బుధవారం జరిగింది. తిరుత్తణి నియోజకవర్గ కన్వీనర్లు వెంకటరాజు, త్యాగరాజన్ ఆహ్వానం పలికిన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో షోలింగర్ ఎమ్మెల్యే మునిరత్నం, మండలాల కో-ఆర్డినేటర్ గులాం మొహిద్దీన్, అరక్కోణం లోక్‌సభ కన్వీనర్ రాజేంద్రన్, రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజన్, తిరుత్తణి మండల అధ్యక్షుడు ఏలుమలై, పల్లిపట్టు పట్టణ అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

సీఎంసీలో వాస్క్యులర్ సర్జరీ థియేటర్



ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాణిపేట సమీపం పూట్టుతాక్కలో ఉన్న సీఎంసీ వైద్య కళాశాల ఆస్పత్రిలో వాస్క్యులర్ సర్జరీ థియేటర్ ప్రారంభమైంది. గురువారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎంసీ వైద్య కళాశాల అధ్యక్షుడు అనుబిందావర్గీ అధ్యక్షత వహించగా, ఆస్పత్రి డైరెక్టర్ డా.విక్రమ్‌మెహదీప్ ఆహ్వానం పలికారు. ఆసుపత్రి కౌన్సిల్ ఉపాధ్యక్షుడు డా.ఝాన్సీ ఉమన్ ఆపరేషన్ థియేటర్ ప్రారంభించారు. సీఎం బీమా కార్డు ఉన్న వారు ఆపరేషన్ చేసుకోవచ్చని, ప్రస్తుతం ఆస్పత్రి అన్ని విభాగాల్లో అధునాతన పరికరాలు ఏర్పాటుచేసినట్లు వాస్క్యులర్ సర్జరీ శాఖ అధ్యక్షుడు దీపక్ సెల్వరాజ్ తెలిపారు.

లైంగిక వేధింపుల కేసు విచారణ బృందం నుంచి వైదొలిగిన డీఎస్పీ

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసు విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం నుంచి డీఎస్పీ రాఘవేంద్ర కె.రవి వైదొలిగారు. అన్నా వర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో జ్ఞానశేఖరన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో పలు ఆరోపణలు రావడంతో హైకోర్టు ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించింది. ఆ ప్రకారం, అన్నానగర్ డిప్యూటీ కమిషనర్ స్నేహప్రియ, ఆవడి డిప్యూటీ కమిషనర్ జమాన్ జమాల్, సేలం డిప్యూటీ కమిషనర్‌తో కూడిన ప్రత్యేక విచారణ బృందం ఏర్పాటైంది. ఈ బృందంలో రాష్ట్ర సైబర్ క్రైం డీఎస్పీ రాఘవేంద్ర కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో, ఈ విచారణ బృందంలోని డీఎస్పీ రామవేంద్ర హఠాత్తుగా వైదొలుతున్నట్లు ప్రకటించారు. తన పని సరిగా చేయనీయకుండా మహిళ ఐపీఎస్ అధికారులు అడ్డుకుంటున్నారని ఆరోపణలు చేసిన ఆయన, డీఎస్పీ పదవికి కూడా రాజీనామా చేయనున్నట్లు డీజీపీకి రాసిన లేఖలో పేర్కొనడం పోలీసు శాఖలో కలకలం రేపింది.

నగరానికి చేరుకున్న రామేశ్వరం జాలర్లు

పెరంబూర్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైలు నుంచి విడుదలైన రామేశ్వరం జాలర్లు ఆరుగురు నగరానికి చేరుకున్నారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి ఈ నెల 11న జాలర్లు చేపల వేటకు వెళ్లారు. ఆ రోజు అర్ధరాత్రి సముద్రంలో చేపలు పడుతుండగా గస్తీ పడవలతో చుట్టుముట్టిన శ్రీలంక నావికాదళం, సరిహద్దులు దాటారని ఆరుగురిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించింది. భారత దౌత్యాధికారుల చర్యలతో అక్కడి న్యాయస్థానం వారిని జాలర్లను విడుదల చేసింది. జైలు నుంచి విడుదలైన జాలర్లు గురువారం ఉదయం విమానంలో నగరానికి చేరుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఏర్పాటుచేసిన వాహనాల్లో జాలర్లను వారి స్వగ్రామాలకు పంపినట్లు మత్స్యశాఖ అధికారులు తెలిపారు.


సంతానం, సూర్య

వెండితెరపై సూర్య వర్సెస్ సంతానం

హీరోలు సూర్య, సంతానం వెండితెరపై తలపడనున్నారు. వీరిద్దరు నటించిన కొత్త చిత్రాలు ఒకే రోజున విడుదలకానున్నాయి. సూర్య హీరోగా తరకెక్కుతున్న 'రెట్రో', సంతానం కథానాయకుడుగా నటించిన 'డిడి నెక్స్ట్ లెవల్' చిత్రాలు మేడే సందర్భంగా మే ఒకటిన విడుదలకు ప్లాన్ చేశారు. 2016లో సంతానం నటించి విజయం సాధించిన 'దిల్లుక్కు దుడ్డు', ఆ తర్వాత 2019లో రిలీజైన ఈ రెండో భాగం ఘనవిజయం సాధించారు. 2023లో ప్రేమ్ ఆనంద్ దర్శకత్వంలో 'డీడీ రిటర్న్స్' పేరుతో సంతానం నటించారు. ఇది నటుడుగా సంతానానికి 125వ మూవీ. ఇపుడు మళ్ళీ ప్రేమ్ ఆనంద్ దర్శకత్వంలో 'డిడి నెక్స్ట్ లెవల్' పేరుతో రూపొందుతున్న మూవీలో సంతానం నటించారు. ఇందులో సంతానంతో పాటు దర్శకులు గౌతం వాసుదేవ్ మేనన్, సెల్వరాఘవన్, కస్తూరి, మొట్టై రాజేంద్రన్, యాషికా ఆనంద్, కీర్తిక తదితరులు నటించారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటుండగా, మే ఒకటో తేదీన విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఇదే రోజున హీరో సూర్య - డైరెక్టర్ కార్తీక్ సుబ్బరాజ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'రెట్రో' మూవీ విడుదల చేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించిన విషయం తెల్సిందే. దీంతో సూర్య, సంతానంలో తొలిసారి వెండితెరపై నువ్వానేనా అని పోటీపడనున్నారు. కమెడియన్ నుంచి హీరోగా ఎదిగిన సంతానం.. ఇపుడు సూర్య లాంటి హీరోలతో పోటీ పడే స్థాయికి చేరుకోవడం గమనార్హం.

తమిళ చిత్రజ్యోతి

రిలేషన్‌లో ఉన్నా... విశాల్ బాయ్‌ఫ్రెండ్ కాదు

అభినయ

తనకు ఒక బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడనీ, అతడితో రిలేషన్‌లో ఉన్నట్టు హీరోయిన్ అభినయ వెల్లడించారు. అయితే, ఆ బాయ్‌ఫ్రెండ్ పేరు హీరో విశాల్ కాదని స్పష్టం చేశారు. 'నాడోడిగల్' మూవీ ద్వారా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అభినయకు మాటలురావు. కానీ, నటనలో మాత్రం అదరగొడుతున్నారు. తమిళంలోనే కాకుండా మలయాళంలో కూడా అద్భుతంగా నటిస్తున్నారు. అయితే, హీరో విశాల్, అభినయ ప్రేమలో ఉన్నట్టు కొన్ని వెబ్‌సైట్స్‌లో వార్తలు వచ్చాయి. వీటిపై ఆమె స్పందిస్తూ, 'నాకు హీరో విశాల్ పెళ్ళి ప్రపోజల్ చేసినట్టుగా కొందరు ప్రచారం చేస్తున్నారు. వాటిని ఏమాత్రం నమ్మొద్దు. ఆ ప్రచారంలో రవ్వంత కూడా నిజం లేదు. పొట్టకూటి కోసం అలా ప్రచారం చేస్తున్నారు. వాటిని నేను పెద్దగా పట్టించుకోవడం లేదు. పైగా నేను ఒక రిలేషన్‌లో ఉన్నాను. నాకు బాయ్‌ఫ్రెండ్ ఉన్నారు. 15 యేళ్ళుగా తెలుసు. చిన్న వయసు నుంచే మేమిద్దరం మంచి స్నేహితులం. ఆయన మంచి వ్యక్తి. ఇంకా పెళ్ళి ప్రస్తావన రాలేదు. దానికి ఇంకా సమయం ఉంది' అని స్పష్టం చేశారు.


అభినయ - విశాల్

ఆర్‌కే నగర్ ఎమ్మెల్యేగా హీరో రవి మోహన్

- 'కరాటే బాబు' పేరుతో కొత్త చిత్రం

హీరో రవి మోహన్ ఎమ్మెల్యేగా కనిపించనున్నారు. ఆయన కథానాయకుడుగా నటించే కొత్త చిత్రం 'కరాటే బాబు'లో రవి మోహన్ ఎమ్మెల్యే పాత్ర పోషిస్తున్నారు. మూవీ టైటిల్ వెల్లడిస్తూ, టీజర్ కూడా రిలీజ్ చేశారు. సంక్రాంతికి 'కాదలిక్క నేరమిల్లై' మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రవి మోహన్.. ఇపుడు తన 34వ చిత్రంలో నటిస్తున్నారు. 'డాడా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ మూవీ అందించిన గణేష్ కె.బాబు రూపొందించే చిత్రానికి శ్యామ్ సీఎస్ సంగీతం. స్క్రీన్ సీన్ మీడియా బ్యానరుపై రూపొందే ఈ మూవీలో నాజర్, కేఎస్ రవికుమార్, శివసుబ్రమణ్యం, వీటీవీ గణేష్, ప్రదీప్ ఆంటోనీ తదితరులు నటించారు. పక్కా రాజకీయ నేపథ్యంలో తెరకెక్కే ఈ సినిమా టీజర్‌లో హీరో రవి మోహన్ ఆర్‌కే నగర్ ఎమ్మెల్యే పాత్ర పోషించగా, విపక్ష నేతగా కేఎస్ రవికుమార్, సీఎంగా నాజర్ కనిపించారు. 'నాకు ఆ పేరు ఆర్‌కే నగర్ ప్రజలు ముద్దుగా పెట్టుకున్నది. ఆ పేరే నన్ను ఇక్కడ వరకు తీసుకొచ్చింది. ఆ పేరు..' అని హీరో చెప్పగా.. మూవీ టైటిల్ వస్తుంది. అంతటితో టీజర్ ముగుస్తుంది. ఈ టీజర్ ఎంతగానో ఆకట్టుకుంటుంది.


'కరాటే బాబు'లో రవి మోహన్

కమల్ పార్టీ నుంచి వైదొలగిన నటి వినోదిని

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నటుడు కమల్ హాసన్ నేతృత్వంలోని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ నుంచి వైదొలిగినట్లు సినీనటి వినోదిని తెలిపారు. ఈ మేరకు ఆమె తన ఎక్స్ పేజీలో పోస్ట్ చేసిన వివరాలిలా ఉన్నాయి... రాజకీయాలు మహా సముద్రంలాంటివని, అందులో కాలుమోపిన నాయకులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు ముందుంచి పోరాడాలని తెలిపారు. ఏడాదిన్నర కాలంగా ఎంఎన్ఎం పార్టీ అభివృద్ధికి తన వంతు ఎంతో కృషిచేశానని తెలిపారు. సామాజిక సేవల్లో భాగంగా వీధుల్లో తిరిగే కుక్కలు, పిల్లులు, గోవుల సంరక్షణ కోసం సొంత డబ్బు వెచ్చించానన్నారు. తగిన గుర్తింపు లేకపోవడంతో పార్టీ నుంచి వైదొగుతున్నానని, ఇందులో ఎవరి ఒత్తిడి లేదని, నా ఇష్టప్రకారమే నిర్ణయం తీసుకున్నానని వినోదిని తెలిపారు.


కమల్ హాసన్‌తో నటి వినోదిని

విజయ్ ఆంటోనీ 25వ చిత్రం 'శక్తి తిరుమగన్'

సంగీత దర్శకుడు, నిర్మాత, డైరెక్టర్ విజయ్ ఆంటోనీ హీరోగా 25వ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమాకు 'శక్తి తిరుమగన్' అనే టైటిల్ ఖరారు చేశారు. 2012 నుంచి హీరోగా అవతారమెత్తిన విజయ్ పలు విజయవంతమైన చిత్రాల్లో నటించారు. ఆయన చివరగా 'హిట్లర్' అనే చిత్రంలో నటించారు. తాజాగా తన 25వ చిత్రంపై అధికారికంగా ప్రకటించారు. అరుణ్ ప్రభు దర్శకత్వం వహించే ఈ మూవీకి విజయ్ ఆంటోనీ హీరోగా నటిస్తూ సంగీతం కూడా సమకూర్చనున్నారు. వేసవికి విడుదల చేసేలా ప్లాన్ చేశారు. 'తుఫాను వేగానికి దుమ్ముధూళి ఉంటాయా? ఇతని వేగానికి శత్రువుల సమూహం నిలుస్తుందా?' అనే ట్యాగ్ పెట్టారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాల్సి ఉంది. తెలుగులో కూడా 'పరాశక్తి' పేరుతో విడుదల చేయనున్నారు. అయితే, తెలుగు టైటిల్‌పై ఇపుడు వివాదం నెలకొంది. శివ కార్తికేయన్ - సుధా కొంగర కాంబినేషన్‌లో రూపొందే సినిమాకు కూడా 'పరాశక్తి' అనే టైటిల్ ఖరారు చేయడం వివాదాస్పదంగా మారింది.


'శక్తి తిరుమగన్' ఫస్ట్‌లుక్


రాజరాజేశ్వరి అలంకారంలో అంకాళపరమేశ్వరి, వేడుకలకు హాజరైన భక్తులు

మేలమలయనూరులో ఊంజల్ ఉత్సవం

- పోటెత్తిన భక్తులు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా మేల్‌మలయనూరు అంకాళ పరమేశ్వరి ఆలయంలో బుధవారం రాత్రి తైమాస అమావాస్య ఊయల ఉత్సవం కనులపండువగా జరిగింది. ఈ వేడుకలకు రాష్ట్రం నలమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి కూడా వేల సంఖ్యలో వచ్చారు. ఊంజల్ ఉత్సవం సందర్భంగా బుధవారం ఉదయం మూలస్థానంలోని అమ్మవారికి, పరమేశ్వరుడికి పంచామృతం, పన్నీర్ తదితర సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వర్ణకవచధారణతో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆ తర్వాత అమ్మవారి ఉత్సవమూర్తి రాజరాజేశ్వరి దేవికి పూలతో అలంకరించి ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగించారు. రాత్రి 11 గంటలకు మంగళవాయిద్యాల నడుమ అమ్మవారు ఊంజల్ మంటపానికి వేంచేసారు. అమ్మవారికి ప్రత్యేక అర్చనాది కార్యక్రమాల అనంతరం దీపారాధన చేసి ఆలయ అంతర ప్రాకారంలోకి ఊరేగింపుగా తీసుకెళ్ళారు. ఈ వేడుకల్లో విల్లుపురం, కడలూరు, సేలం, వేలూరు, తిరువణ్ణామలై, కాంచీపురం, చెన్నై తదితర జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి వచ్చిన భక్తులంతా అమ్మవారిని దర్శించుకుని రాత్రంతా ఆలయ ప్రాంగణంలోనే జాగరం చేసి గురువారం వేకువజాము స్వస్థలాలకు బయలుదేరారు. ఈ వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ప్రపంచ రికార్డు సృష్టించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు


తిరువళ్లువర్ విగ్రహ నమూనాలో విద్యార్థులు

ప్యారీస్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా వెంగపాక్కం ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో 1,330 మంది విద్యార్థులు తిరువళ్లువర్ ఆకారంలో నిలబడి 'ఇన్షన్' ప్రపంచ రికార్డు పుస్తకంలో చోటు దక్కించుకున్నారు. అన్బు అనే ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ రికార్డు కార్యక్రమం నిర్వహించగా, ముఖ్యఅతిథిగా కాంచీపురం ఎంపీ సెల్వం, ప్రధానోపాధ్యాయులు నళిని, మాజీ ఎమ్మెల్యే తమిళ్‌మొళి, తిరుక్కుండ్రం మున్సిపాలిటీ కమిషన్ అరసు తదితర ప్రజా ప్రతినిధుల సమక్షంలో తమిళ మహాకవి తిరువళ్లువర్ రచించిన 1,330 సూక్తులు, ఆయన ఆకారంలో 1,330 మంది విద్యార్థిని, విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలో నిలబడి రికార్డు నెలకొల్పారు. వీరిని అభినందిస్తూ పాఠశాల యాజమాన్యానికి ఇన్షన్ రికార్డు సంస్థ ప్రతినిధులు ధ్రువకరిస్తూ విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు.


అడయార్‌లోని మద్రాస్ ఈఎన్టీ పరిశోధనా సంస్థ అధ్యక్షులు డాక్టర్ మోహన్ కామేశ్వరన్ 70వ జన్మదినం సందర్భంగా ఆయన నివాసగృహానికి సతీసమేతంగా వెళ్ళి శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది

- వామ్ వీఎన్ హరినాథ్



అన్నదాన కార్యక్రమంలో వామ్ నిర్వాహకులు

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చెన్నై విభాగం వామ్ ఆధ్వర్యంలో గురువారం కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) సీనియర్ సిటిజన్ ఫోరమ్ తమిళనాడు అధ్యక్షులు వీఎన్ హరినాథ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ అన్నదానంలో సుమారు 650 మంది పేదలకు, ఆస్పత్రిలోని రోగులకు అన్నదానం చేశారు. దీనికి తంగుటూరి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం హరినాథ్ మాట్లాడుతూ, బెల్లంకొండ బ్రదర్స్ తల్లిదండ్రులైన బెల్లంకొండ వెంకటేశ్వర్లు, సుబ్బరావమ్మ జ్ఞాపకార్థం ఆస్పత్రి ప్రాంగణంలో అన్నదానం చేశామన్నారు. సేవే లక్ష్యంగా 2024వ సంవత్సరం జూన్ నుండి ఇప్పటిదాకా, తాము పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. వామ్ సేవలు అభినందనీయమని, ఈ ట్రస్టు ద్వారా ఎంతోమందికి ఉచిత వైద్యశిబిరాలు, వృద్ధులకు సహాయాలు అందిస్తున్నారని తంగుటూరి రామకృష్ణ కొనియాడారు. కార్యక్రమంలో వామ్ గ్లోబల్ చైర్మెన్ బాబురావు, వామ్ గ్రేటర్ చెన్నై విభాగం ప్రెసిడెంట్ బెల్లంకొండ సాంబశివరావు, బెల్లంకొండ శివప్రసాద్, బెల్లంకొండ సునీల్, కార్యదర్శి వి.దామోదర్, కోశాధికారి జగదీష్ శర్మ, జాయింట్ సెక్రటరీ ఏ.సుధాకర్, వాలంటీర్లు పీపీ గోపాల్, బెల్లంకొండ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

టాక్స్‌పై రాయితీ ఇవ్వాలి

- ప్రముఖ నటుడు విజయ్ సేతుపతి

అడయార్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా పన్ను చెల్లించిన వారికి రాయితీలివ్వాలని సినీ నటుడు విజయ్ సేతుపతి కోరారు. ఆదాయపన్ను శాఖ ఆధ్వర్యంలో పన్ను చెల్లింపుదారుల విభాగం (ట్యాక్స్ పేయర్స్ సెంటర్) ప్రారంభోత్సవం గురువారం మదురైలో జరిగింది. న్యూఢిల్లీ లోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్ బోర్డు మెంబర్ హెచ్.పి.ఎస్. గిల్ అధ్యక్షత వహించగా ఆదాయపన్ను శాఖ మదురై విభాగం ప్రిన్సిపల్ కమిషనర్ సంజయ్ రాయ్, ప్రిన్సిపల్ కమిషనర్ టి.వసంతన్ తదితరులు పాల్గొన్నారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన నటుడు విజయ్ సేతుపతి మాట్లాడుతూ, ప్రభుత్వ విషయాలు తెలుసుకోవడం కష్టం గా ఉందనీ, కానీ ఆన్‌లైన్‌లో ఆదాయపన్ను విషయాలు తెలుసుకోవడం సులభంగా ఉందన్నారు. పాన్ కార్డు దరఖాస్తు ఇంగ్లీస్, హిందీ భాషల్లోనే ఉందనీ, తమిళంలో కూడా ఉంటే బాగుంటుందన్నారు. హక్కుల కోసం ప్రభుత్వా న్ని ఎలా కోరుతున్నామో.. ఆ మేరకు పన్నులను కూడా చెల్లించాలన్నారు. తన మనసులో చాలా కాలంగా ఒక కోరిక ఉందన్నారు. ఆరోగ్యం బాగున్నపుడు బాగా సంపాదించి పన్ను చెల్లిస్తున్నామన్నారు. అనారోగ్యంతో ఆదాయం లేనివారికి ప్రభుత్వం ఏదో రూపంలో కొన్ని రాయితీలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ సేతుపతి

పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే లక్ష్యం

- వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్

వేలూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అందరికి విద్యా ట్రస్ట్ 13వ వార్షికోత్సవం వీఐటీ ఛాన్సలర్ విశ్వనాధన్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వేలూరు వీఐటీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఉదయం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీమంత్రి ఎస్ఎస్ కృష్ణమూర్తి, తిరువణ్ణామలై జిల్లా కలెక్టర్ డి.భాస్కర పాండియన్ పాల్గొన్నారు. ఇందులో ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ, పేదవిద్యార్థులకు ఉన్నతవిద్య అందించేందుకు 2012వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా సుమారు 9,400 మంది పేదవిద్యార్థులకు వారు కోరుకున్న విద్య ఉచితంగా అందించగలిగామన్నారు. ఎంతోమంది దాతల ప్రోత్సాహంతో మరింత వే గ ం గా ముందుకెళ్తున్న తమ ట్రస్టులో ఇప్పటి వ ర కు వే లూ ర ు లోనే కాకుండా తిరువణ్ణామలై, రాయపేట జిల్లాలోని నిరుపేద విద్యార్థులకు ఆసరాగా నిలిచిందన్నారు. ఈ సంవత్సరం కూడా తమ సంస్థకు విరాళాలు అందించారని హర్షంవక్తంచేశారు. రాబోయే రోజుల్లో కూడా ట్రస్ట్ ద్వారా సేవలందించడానికి తామెప్పుడు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ట్రస్టుకు సంబంధించిన బుక్‌లెట్‌ను సభ్యులంతా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యాక్షులు జీవీ సెల్వం, కోశాధికారి వెంకట సుబ్బు, పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులు, ఇతర విద్యాసంఘాల నిర్వాహకులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

యూపీ మాజీ సీఎం అఖిలేష్‌తో సత్యాదేవి భేటీ


సత్యాదేవికి పుస్తకం అందజేస్తున్న అఖిలేష్ యాదవ్

చెన్నై, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సామాజిక సేవకురాలు, తెలుగు ప్రముఖురాలు, లయన్ సత్యాదేవి ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌తో భేటీ అయ్యారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు వెళ్లిన సత్యాదేవి తిరుగు ప్రయాణంలో బుధవారం లక్నోలో అఖిలేష్ నివాసానికి వెళ్లి, ఆయనతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అఖిలేష్ యాదవ్.. తన కుటుంబ సభ్యులను పరిచయం చేసి, తేనీటి విందు ఇచ్చారు. అనంతరం 2013లో జరిగిన కుంభమేళాపై ప్రచురించిన పుస్తకాన్ని సత్యాదేవికి బహూకరించారు. తమిళనాడు రాజకీయాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్న అఖిలేష్ యాదవ్.. చెన్నై వచ్చినప్పుడు మళ్లీ భేటీ అవుదామని చెప్పినట్లు సత్యాదేవి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నాడు.

మైలాపూర్‌లో ఆసనా క్లినిక్ ప్రారంభం

అడయార్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్‌లోని ఆసనా కొలొరెక్టర్, గట్ వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభించారు. మెరుగైన ఆరోగ్యం వైపు వ్యక్తులను శక్తివంతం చేసే దృష్టితో, ఆసనా అత్యాధునిక రోగనిర్ధారణ, అధునాతన చికిత్స, వ్యక్తిగత అవసరాలకనుగుణంగా బెస్పోక్ వెల్‌నెల్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఇందులో ది ఆసనా బట్ చెక్, ది సన్‌షైన్ ప్రాజెక్టు, ది గట్ వైవీ ప్రాజెక్టు, ది న్యూ మామ్ ప్రొగ్రామ్, ది పాస్ ప్రొగ్రామ్, కొలొన్ హైడ్రోథెరపీ అండ్ గట్ క్లీన్స్ వంటి అత్యాధునిక సేవలు అందిస్తున్నట్టు ఆ క్లినిక్ నిర్వాహకులు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



ఆసనా క్లినిక్ నిర్వాహకులు


చెన్నై సచివాలయంలో మంత్రులు, ఉద్యోగులు, సిబ్బంది చేత అంటరానితనం నిరోధక ప్రతిజ్ఞ చేయిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

కోవైలో సమర్థనం ట్రస్ట్ సేవల విస్తరణ

అడయార్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సేవలో నిమగ్నమైవున్న సమర్థనం తన సేవలను కోయంబత్తూరుకు విస్తరించింది. ఇందుంలో భాగంగా కోవైలో 17వ లైవ్లీహుడ్ రిసోర్స్ సెంటర్ (ఎస్ఆర్‌సీ)ని ప్రారంభించింది. ఈ తరహా కేంద్రాన్ని తమిళనాడులో ప్రారంభించడం ఇది రెండోది. సమాజంలో వెనుకబడిన యువత, దివ్యాంగులకు సాధికారత కల్పించడం కోసం తమ సేవలను కోవైకు విస్తరించినట్టు ఆ సంస్థ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. కాగా, ఎల్ఆర్‌సీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో సమర్థనం ట్రస్ట్ ఫండింగ్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ మహంతేష్ జీకే, కేపీఎంజీ అసోసియేట్ పార్ట్‌నర్ పియూష్ సింఘానియా, కేపీఎంసీ అసోసియేట్ డైరెక్టర్ ఇంద్రప్రీత్ కౌర్, కోవై కార్పొరేషన్ 20వ డివిజన్ కార్పొరేటర్ మరియ రాజ్, మాజీ మేయర్, 19వ డివిజన్ కార్పొరేటర్ కల్పనా ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమర్థనం సెంటర్ ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తున్న నిర్వాహకులు


ఇస్రో శాస్త్రవేత్తలకు 'వంద'నం



రాకెట్ నమూనాలో కొందరు.. 100 అంకె ఆకృతిలో మరికొందరు. ఇలా విద్యార్థులు కూర్చుని ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. షార్ నుంచి బుధవారం వందో రాకెట్ ప్రయోగం విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం గూడూరులోని గాయత్రి ఇంగ్లీషుమీడియం పాఠశాలలో విద్యార్థులు రాకెట్ నమూనాలో మానవహారాన్ని ఏర్పాటు చేసి శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, సోనియా, రఫీ, రాఘవయ్య, సుప్రజ, మస్తాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

ట్రయల్ రన్



రథసప్తమి సందర్భంగా తిరుమలలో ఫిబ్రవరి 4న ఉదయం నుంచి రాత్రి వరకు ఏడు వాహనాలపై మలయప్ప మాడవీధుల్లో ఊరేగనున్నారు. ఈక్రమంలో భారీ పరిమాణంలో కలిగిన సర్వభూపాల, సూర్యప్రభ వాహనాల పటిష్టతను పరిశీలించేందుకు టీటీడీ అధికారులు గురువారం ఉదయం ట్రయల్ రన్ నిర్వహించారు. అధిక బరువుండే ఈ వాహనాల ఊరేగింపులో వాహన బేరర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పరిశీలించారు. వాహన మండపం నుంచి ఆలయం వరకు.. అక్కడ్నుంచి తిరిగి వాహనమండపం వరకు ఈ ట్రయల్ రన్ నిర్వహించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 7 గంటలు




తిరుమలలో వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 9 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

మంగళవారం నాటి హుండీ ఆదాయం : రూ.3.14 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 62,710

తలనీలాలు సమర్పించినవారు : 15,635







తిరుపతి కపిలతీర్థం వద్ద టాస్క్‌ఫోర్సు ఆఫీసు ఆవరణలో శిథిలమవుతున్న వాహనాలు





వామ్మో... ఇవన్నీ పుష్పా కార్లు

- ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడి తుక్కుగా మారుతున్న వాహనాలు
- దర్యాప్తులో జాప్యంతో రూ.కోట్ల నష్టం

తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఈ కార్లు వేలం వేస్తామహో...! అని తిరుపతి డివిజన్ అటవీశాఖ ప్రకటించింది. ఇండియాలో షోరూములున్న అన్ని కార్లూ కపిలతీర్థం దగ్గరున్న టాస్క్‌ఫోర్స్ ఆఫీసు ఆవరణలోని తుప్పల్లో ఇలా ఉన్నాయి. కోరిన మోడల్.. కారు చవగ్గా వేలంలో ఎగరేసుకుపోవచ్చని ఆశ పడితే మాత్రం హుళుక్కే! వీటిలో ఇంజన్లు ఉన్నాయో లేదో తెలీదు. ఉన్నా ఏ పార్టులు మిగిలివున్నాయో చెప్పలేం. విత్తనాలు పడి, మొక్కలు మొలిచి, మానులై పెరిగి, తీగలు అల్లుకుని ఇదిగో ఇలా ఉన్న ఈ కార్లను కొని రోడ్ల మీద తిప్పడం సాధ్యమేనా? తుక్కుకు తప్ప పనికిరాని తుప్పుగా మారిన ఈ కార్లను కొనే సాహసం పాత సామాన్లు కొనేవారు తప్ప ఇంకెవరూ చేయడం లేదు. అందుకే 2024 సెప్టెంబర్‌లో 40 వాహనాలను వేలం వేయగా కేవలం రూ.18.59లక్షలు మాత్రమే వచ్చింది. ఫిబ్రవరి 5న 153 వాహనాలు వేలం వేసేందుకు అటవీ శాఖ సిద్ధపడింది. ఇంకా 800కు పైగా వాహనాలు కనీసం తుక్కుగా కూడా పనికిరాని విధంగా పడివుంటాయన్నమాట.

ఎందుకిలా?

దర్యాప్తులో అసాధారణ జాప్యం వల్ల ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పట్టుబడ్డ వాహనాలు ఇలా పనికిరానివిగా మిగిలిపోతున్నాయి. పట్టుబడ్డ వాహనాల యజమానులను గుర్తించడమే పెద్ద సమస్య. స్మగ్లింగ్‌కి వాడే వాహనాలకు సాధారణంగా అసలు నెంబర్లు ఉండవు. చాసిస్ నెంబర్లను కూడా మార్చేస్తుంటారు. దీంతో వీటి అసలు యజమానులు ఎవరో తేలలేదు అని నిర్ధారించేసరికే ఏళ్లకు ఏళ్లు పడుతోంది. అప్పటికే ఇవి మట్టిలో కూరుకుపోయి, చెట్ల మధ్య మునిగిపోయి ఇలా మారుతున్నాయి. ఆ తర్వాత వీటి వేలాని అనుమతి పొంది, విలువ కట్టాల్సిందిగా ఆర్టీవో కార్యాలయాన్ని కోరుతారు. వారు ధరలు నిర్ణయించాక వేలం ప్రకటిస్తారు. తీరా వేలం వేసే నాటికి ఇనుముగా తప్ప ఇంక దేనికీ పనికిరాకుండా పోతున్నాయి. ఇట్లా లారీలు, వ్యాన్‌లు, ఆటోలు, కార్లు కుప్పలు తెప్పలుగా పడివుంటున్నాయి. భాకరాపేట ఘాట్‌లో అయితే ఈ వాహనాలను మట్టిలో కలిపేస్తూ ఒక అడవే పెరిగింది.

రూ.30 కోట్ల ఆదాయం మటాష్!

దర్యాప్తులో వేగం పెంచి, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో వ్యవహరిస్తే పట్టుబడిని ఏడాదిలోనే ఈ వాహనాలను వేలం వేసే అవకాశం ఉంటుంది. ఇలా చేయగలిగితే ప్రభుత్వానికి భారీ ఆదాయం కూడా లభిస్తుంది. తిరుపతి డివిజన్ పరిధిలో 2000 నుంచి గతేడాది చివరి వరకూ స్వాధీనం చేసుకున్నవే వెయ్యి వాహనాలదాకా ఉన్నాయి. పట్టుబడిన ఏడాదిలోగా వేలం వేయగలిగితే సగటున ఒక వాహనం రెండు నుంచి మూడు లక్షలకు అమ్ముడయ్యే అవకాశం ఉంటుంది. అంటే దాదాపు 20 నుంచి 30 కోట్ల రూపాయల ఆదాయం లభించేది.



భాకరాపేట ఘాట్ పక్కన తుక్కుగా మారిన వాహనాలు

దర్యాప్తు తుప్పు వదిలితే కోట్ల ఆదాయం

- స్వాధీనం చేసుకున్న వాహనాలను ఎక్కడపడితే అక్కడ కాక భద్రతగల ప్రత్యేక ప్రాంతాల్లో పార్క్ చేయాలి.
- పట్టుబడిన వాహనాల ప్రతి పార్ట్‌నూ వీడియో రికార్డు చేయచ్చు.
- అసలు యజమానులను గుర్తించే ప్రక్రియకు ఏడాదికి మించకుండా గడువు
- చార్జ్‌షీట్ల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి.
- ప్రత్యేక కోర్టుల ద్వారా కేసుల విచారణ త్వరితగతిన పూర్తి చేయాలి.



చేతివాటమూ ఘనమే

పట్టుబడిన వాహనాల్లోంచి ముఖ్య భాగాలు మాయమైపోతుంటాయి.ముందుగా మాయమ య్యేది బ్యాటరీలు. వాటి స్థానంలో పనికిరాని బ్యాటరీలు ప్రత్యక్షమవుతాయి. కొన్ని వాహనా లకైతే ఏకంగా ఇంజన్లే మాయమైపోతుం టాయి. మానిటర్లూ, జీపీఎస్‌లూ వంటివి అయితే అసలు మిగలవు. ఎలాగూ ఇప్పట్లో తేలే వ్యవహారం కాదు కాబట్టి ఇంటి దొంగలే చేతివాటం ప్రదర్శిస్తుంటారని తెలుస్తోంది.

5న 153 వాహనాల వేలం

తిరుపతి డివిజన్ పరిధిలో పట్టుబడిన 153 వాహనాలను ఫిబ్రవరి 5న తేదీన కపిలతీర్థం వద్ద జిల్లా అటవీ అటవీ శాఖ కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నారు. ఆ తర్వాత మరో 200 వాహనాలకు కూడా బహిరంగ వేలం వేయనున్నట్లు సమాచారం.



ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



తిరుమల, జనవరి30 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు గురువారం రూ.10 లక్షలు విరాళంగా అందింది. తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ ఛైర్మన్ సూర్యనారాయణరెడ్డి దంపతులు విరాళం చెక్‌ను అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఈకార్యక్రమంలో బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి కూడా ఉన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం బోల్తా

- సీఐతో పాటు డ్రైవర్‌కు తీవ్రగాయాలు



తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లి సమీపంలో శ్రీకాళహస్తి రూరల్ సీఐ వాహనం గురువారం రోడ్డుకు ఎడమ వైపున బోల్తా పడింది. రోడ్డుపై వస్తున్న ఆవులను తప్పించబోయే క్రమంలో అదుపు తప్పడంతో ఈ ప్రమాదం జరిగింది. సీఐతో పాటు డ్రైవర్‌కూ తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఎస్పీ కార్యాలయంలో అధికారిక పనుల నిమిత్తం శ్రీకాళహస్తి రూరల్ సీఐ రవినాయక్, సిబ్బంది గురువారం ఉదయం తిరుపతికి వచ్చారు. ఇక్కడ పనులు ముగించుకుని తిరిగి వెళుతుండగా ఒక్కసారిగా ఆవులు రోడ్డుపైకి పరుగెత్తుకుంటూ వచ్చాయి. ఈ ఆవులను తప్పించబోయే క్రమంలో వాహనం రోడ్డుకు ఎడమవైపున పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. వాహనంలోని రూరల్ సీఐ రవినాయక్‌తో పాటు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

నేడు పెళ్లి జరగాల్సి ఉండగా..!

- పది రోజుల కిందట అదృశ్యమైన విద్యార్థిని
- పంబలేరువాగులో లభ్యమైన మృతదేహం

గూడూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అంతా అనుకున్నట్లు జరిగుంటే.. ఆ ఇంట పెళ్లి బాజాలు మోగాల్సింది. శుక్రవారం ఉదయం ఆమె పెళ్లి కూతురుగా పీటలమీదకు ఎక్కాల్సి ఉంది. కానీ.. ఆ ఇంట విషాదం నెలకొంది. పది రోజుల కిందట అదృశ్యమైన ఆ విద్యార్థిని.. పంబలేరు వాగులో గురువారం మృతదేహంగా తేలింది. ఈ విషాద ఘటన గూడూరు మండలం పోటుపాళెం సమీపంలో చోటుచేసుకుంది. గూడూరు రూరల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. సూళ్లూరుపేటలోని రాఘవయ్యపేటకు చెందిన శామ్యూల్ జయకుమార్, రమాదేవి దంపతుల కుమార్తె లేహానిస్సి(19) గూడూరులోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ రెండో సంవత్సరం చదువుతోంది. ఈమెకు సమీప బంధువుతో ఈ నెల 31వ తేదీ (శుక్రవారం) పెళ్లి నిశ్చయించారు. ఈ క్రమంలో ఈనెల 20వ తేదీన కళాశాలకు వెళ్లిన లేహానిస్సి ఇంటికి రాలేదు. పలుచోట్ల వెదికిన కుటుంబసభ్యులు.. ఆమె కనిపించడంలేదని ఈనెల 21న సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గూడూరు మండలం పోటుపాళెం సమీపంలోని పంబలేరువాగులో గురువారం లేహానిస్సి మృతదేహం లభ్యమైంది. శుక్రవారం ఉదయం పెళ్లి జరగాల్సి ఉండగా ఆమె మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. విద్యార్థిని మృతికి గల కారణాలను పోలీసులు విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించి రూరల్ ఇన్‌చార్జి ఎస్‌ఐ తిరుపతయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



లేహానిస్సి (ఫైల్ ఫొటో)

పూడుపాముల రవాణా కేసులో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష

- 15 ఏళ్లనాటి కేసులో తీర్పు

సత్యవేడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పూడు పాముల అక్రమ రవాణా కేసులో ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్ష విధిస్తూ సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు తీర్పు వెలువరించింది. వివరాలిలా ఉన్నాయి. 2009 జూలై 22వ తేదీన సత్యవేడు మండలం పేరడం గ్రామానికి చెందిన మేకల లక్ష్మయ్య, తమిళనాడు రాష్ట్రం ఊత్తుకోట్టైకు చెందిన రజిని, రాధ.. సత్యవేడు అటవీప్రాంతం నుంచి నాలుగు పూడు పాములు పట్టుకుని అక్రమ రవాణా చేస్తుండగా అప్పటి ఎస్‌ఐ బీవీ శ్రీనివాసులు పట్టుకున్నారు. పాముల సహా వీరిని అటవీశాఖకు అప్పగించారు. 2022లో అప్పటి ఎఫ్ఆర్‌వో జయప్రసాదరావు అటవీ హక్కులు, వన్యప్రాణి విభాగం చట్టం ప్రకారం చార్జిషీటు దాఖలు చేయగా, ఎఫ్‌బీవో వేణుగోపాల్ ఇందుకు సంబంధించిన సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం నిరూపణ కావడంతో ముగ్గురు నిందితులకు ఏడాది జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ ఇన్‌చార్జి న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పును వెలువరించారు.

ఇద్దరు 'ఎర్ర' దొంగలకు ఐదేళ్ల జైలు

- రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం అదనపు జిల్లా జడ్జి నరసింహమూర్తి గురువారం తీర్పు చెప్పారు. దీనికి సంబంధించి ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. ఎనిమిదేళ్ళ క్రితం తమిళనాడుకు చెందిన కె.మణి, పి.దొరస్వామి ఎర్రచందనం అక్రమంగా తరలిస్తూ నాగపట్ల బీట్ పరిధిలోని చామల రేంజ్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. దీంతో ప్రస్తుతం ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్పీ శ్రీనివాస్ కేసులో ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలపై సమీక్షిస్తూ సూచనలు జారీ చేశారు. సాక్ష్యాధారాలు కోర్టుకు హాజరుపరచడం మొదలు నిందితులకు జైలు శిక్ష పడేలా విశేష కృషి చేశారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నిందితులకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. దీంతో పోలీసు బందోబస్తు మధ్య నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ఎల్ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో గతేడాది ఆగస్టు-సెప్టెంబరు నెలల్లో నిర్వహించిన సీబీసీఎస్, నాన్ సీబీసీఎస్ ఎల్ఎల్‌బీ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మూడేళ్ల ఎల్ఎల్‌బీ నాల్గవ సెమిస్టర్, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ నాలుగు, ఎనిమిది సెమిస్టర్ పరీక్షల ఫలితాలను గురువారం విడుదల చేశారు. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపర్చినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

ఎస్వీయూ దూరవిద్యా పరీక్షలు వాయిదా

- ఉత్తర్వులు జారీ చేసిన వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి నిర్వహించాల్సిన దూరవిద్యా పరీక్షలు వాయిదా వేసినట్లు వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

రేపు ఇంటింటా పింఛన్ల పంపిణీ

- లబ్ధి పొందనున్న 2,63,191మంది

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫిబ్రవరి నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను శనివారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. పింఛన్ల పంపిణీపై జిల్లా అధికారులతో ఆయన గురువారం టెలీ కాన్ఫరెన్సు నిర్వహించారు. శుక్రవారం బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని శనివారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేయాలన్నారు. 2వ తేదీ ఆదివారం కావడంతో మిగిలిన వారికి 3వ తేదీ పంపిణీ చేయాలని ఆదేశించారు.జిల్లాలోని 691సచివాలయాల పరిధిలో 2,63,191 మందికి ప్రభుత్వం రూ.112.19 కోట్లు మంజూరు చేసిందన్నారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక



ప్రాణదాన కమిటీలో రోగులను ఎంపిక చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుపతి(వైద్యం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పేద రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు టీటీడీ నిర్వహిస్తున్న ప్రాణదాన పథకానికి 194 మందిని ఎంపిక చేశారు. స్విమ్స్‌లో గురువారం డైరెక్టర్ ఆర్వీకుమార్ ఆధ్వర్యంలో ప్రాణదాన కమిటీ సమావేశం నిర్వహించారు. ఆర్థిక స్థోమత లేని అర్హులైన నిరుపేద రోగులను వైద్య విభాగాల వారీగా ఉచిత శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్డియోథొరాసిక్ 18, ఎండోక్రైనాలజీ 1, జనరల్ సర్జరీ 3, మెడికల్ అంకాలజీ 2, మెడిసిన్ 21, నెఫ్రాలజీ 55, న్యూరాలజీ 36, న్యూరో సర్జరీ 19, గైనకాలజీ 2, రేడియేషన్ అంకాలజీ 5, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ 29, సర్జికల్ అంకాలజీ 2, యూరాలజీ 1 చొప్పున ఎంపిక చేశారు. ప్రాణదాన పథకానికి దాతలు అండగా నిలవాలని డైరెక్టర్ ఆర్వీకుమార్ కోరారు.

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి కుమారస్వామి

తిరుమల, జనవరి30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. వేకువజామున ఆలయంలో జరిగిన తోమాల సేవలో ఆయన కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని రాక

- తిరుపతిలో కూటమి పార్టీల నేతలతో సమావేశం
- రేపు శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ శుక్రవారం తిరుపతికి రానున్నారు. గురువారం కలెక్టరేట్‌కు అందిన సమాచారం ప్రకారం.. శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తిరుపతి చేరుకుని తిరుచానూరు రోడ్డులోని ఓ హోటల్‌లో బస చేస్తారు. అక్కడ జిల్లా ఎమ్మెల్యేలు, కూటమి పార్టీల నేతలతో సమావేశమవుతారు. ఖాళీగా ఉన్న తిరుపతి డిప్యూటీ మేయర్ పదవికి ఫిబ్రవరి 3న ఎన్నిక జరగనున్న నేపథ్యంలో దీనిపై కూటమి పార్టీల నేతలతో చర్చించే అవకాశముంది. శనివారం ఉదయం శ్రీకాళహస్తి చేరుకుని పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఆలయ ఈవో బాపిరెడ్డి తదితరులతో సమావేశమై సమీక్షించనున్నారు.

సబ్ జైళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు ఆ మేరకు పనులకు సిద్ధమయ్యారు. తిరుపతి, సత్యవేడు, శ్రీకాళహస్తి సబ్ జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. తిరుపతిలో 10 నుంచి 12, సత్యవేడులో 10, శ్రీకాళహస్తిలో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.